# ఆమె

ఉమెన్స్ కాలేజీకి కుడి వైపున్న గేట్ దగ్గర గత కొద్ది రోజులుగా ఆమె చాలామందికి పరిచయమైంది. అదో రకం చీరకట్టుతోపాటు నుదుటి మీద, పాపట్లోనూ బొట్టు, ముక్కుకు చిన్న పోగు, చెవులకు రింగులు... చాలా సింపుల్.

మనిషికాదు, ఆవిడ మాట్లాడే తెలుగు, నార్త్ స్టైల్ హిందీ కూడా చాలా అందంగా వుంది.

భుజానికొక బ్యాగ్, చేతిలో కొన్ని పెన్నులతోపాటు మరికొన్ని మాథమెటికల్ ప్రాబ్లమ్స్ బుక్స్ కూడా వున్నాయి. వాటిని ఆమే విధం అక్కడి వాళ్ళందరినీ ఆకర్షించింది.

ఆమెక్కావలసింది కూడా అదే.

** ** **

మంగ, కపిల, మేరీ ఆధునిక భావాలుకల సామాజిక ప్రగతిగాములు

ఏదో రకంగా ఆమెతో ఈ ముగ్గురికీ చనువెక్కువైంది. అంతే... ఆమె అన్నయ్యగా అతడు పరిచయమయ్యాడు.

ఆడవాళ్ళ కాలేజి చుట్టూ తిరిగి అన్ని విధాలుగా నష్టపోయే పోకిరీ వెధవల్లాగాక చాలా వినయ విధేయతల్తో కనిపించాడతను.

అతడంటే ముగ్గురికీ ఇష్టమే కాబట్టి కలసికట్టుగా ప్రేమించేసి హోటళ్ళు, సినిమాలు, పార్కులు వగైరా అన్నీ తిరిగారు.

** ** **

డైరక్టుగా బొంబాయి కెళ్ళి అక్కడ చతుర్వేదిని కలుసుకుంటే మన పని ఈజీగా అయిపోతుందని చెప్పిందామె. స్టూడియో కెళ్ళి షూటింగ్ అవీ చూశాకే ఇష్టముంటే వేషం గురించి అడుగుదాం. లేకపోతే తిరిగొచ్చేద్దాం. అయినా... కపిలకు మాత్రం తప్పకుండా వేషం దొరకొచ్చు మరి.

కలల అంచుల్లో కెళ్ళారు ముగ్గురు.

ప్లాన్ ప్రకారం కొంత నగదు, బంగారు వస్తువులతో బాటు అయిదుగురూ మివారెక్కారు.

అంతే...

మూడోరోజు పేపర్లన్నీ అచ్చేశాయి - నగరంలో అమ్మాయిలను మోసగించి తరలిస్తున్న మూఠా ఒకటుందంటూ. అలాగే కనిపించకుండా పోయిన ముగ్గురమ్మాయిల ఫోటోలతో పాటు కాలేజీ దగ్గరి ఆమె, వాళ్ళన్నయ్యను గురించి కూడా రాశారు.

ఆలోచన లేకుండా చెప్పుడు మాటలకు మోసపోవద్దంటూ నగర ప్రజలనుద్దేశించి పోలీస్ కమిషనర్ తెలుపుతున్నట్టు కూడా వ్రాశారు.

— కన్నోజు లక్ష్మీకాంతం



# పెళ్ళి చూపులు-చూపులు

కాలమ్‌దాటని కథల పోటీ సాధారణ ప్రచురణ కథలు

"ఇంతకీసారైనా అమ్మాయి నచ్చిందట్రా."

'అబ్బే బొత్తిగా ఎర్రకోతిలా వుందనుకో... అయినా అంత ఎరుపేమిటి!'

'కొద్దిగా రంగు తక్కువైతే తారుడబ్బా అంటావుగా' నిట్టూర్చింది పెద్దమ్మ.

'అది కాదురా అన్నయ్యా- మొన్నో సంబంధం చూపిచ్చావుగా... ఆ అమ్మాయెలా వుంది?'

'అబ్బ మరుగుజ్జే అనుకో... బుగ్గ మీద నల్ల మచ్చొకటి...'

'నల్లగుందనీ, పళ్ళు తెల్లగా లేవనీ, బుగ్గమీద సొట్ట పడలేదనీ, పాడవాటి జుట్టు లేదనీ... ఇలా వంకలు పెడుతుంటే నీకీ జన్మలో కాదుకదా వచ్చే జన్మలో పెళ్ళవడం కూడా డౌటే...'

మరునటి రోజే మా పెదనాన్న ఫ్రెండ్ కూతురి పెళ్ళి ఒకటి వుండడంతో అందరం బెజవాడ బయల్దేరాం. పెళ్ళి ఘనంగా జరిగింది. తిరుగు ప్రయాణానికి సర్దుతుండగా పెదనాన్న వచ్చారు పాడావిడిగా... వస్తూనే... 'పార్వతీ! ఆ పరంధామయ్య లేడూ... వాళ్ళమ్మాయి- అదే తెల్లగా కుందనపు బొమ్మలా తిరుగుతుండింది పందిట్లో... ఆ పిల్ల మనవాడికి నచ్చిందట. అన్ని విషయాలు మాట్లాడాను. ఏ విషయం వూరికి వెళుతూనే లెటర్ రాస్తామన్నారు...'

వాళ్ళు బాగా సంపన్నులవడంతో దండిగా కట్నం తెచ్చే పిల్ల కోడలవుతుందని ఎగిరి గంతేసింది పెద్దమ్మ.

ఇక అన్నయ్య సరేసరి. తన ఊహాసుందరి ఇంత త్వరగా సాక్షాత్కరిస్తుందని అనుకోలేదట పాపం. బొత్తిగా ఈ లోకంలో వుండడం లేదు. ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. లెటర్ నేను చించుతానంటే నేనని పోటీ పడ్డాం. వణుకుతూ నేనే చించా లెటర్‌ని... ఒకే వాక్యం అందులో...

"క్షమించాలి, అమ్మాయికి అబ్బాయి నచ్చ లేదంట"

—ఆర్. అనూరాధ

# టి.వి. కార్టూన్ స్టుడియో

రాజాపాత్రుడు
జంబాజుంబా రాక్షసుడు